

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శుక్రవారం 22 మార్చి 2024



మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి
విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలి
- జిల్లా విద్యాధికారి రమేష్
8

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:26 శుక్రవారం
సహర్ 4:49 శనివారం



నగదు కష్టాలు


జిల్లెల్ల చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

- పార్లమెంట్ ఎన్నికల కోడ్‌తో నగదు లావాదేవీలపై నిఘా
- బ్యాంక్ ఖాతాలపై దృష్టి
- రంగంలోకి దిగిన పోలీసులు, ఎన్నికల నిఘా బృందాలు
- తనిఖీలు ముమ్మరం
- వ్యాపారులు, సామాన్యులకు తిప్పలు
- రూ 50 వేలు దాటితే సీజ్... ప్రతీ లెక్కకు రుజువు ఉండాలి

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఎన్నికలు అనగానే నగదుతోనే ముడిపడి ఉంటుంది. డబ్బులు, మద్యం, ఓటర్లను ప్రలోభాలు గురిచేయడానికి అస్త్రంగా వాడుకుంటారు. వీటిని అరికట్టడానికి ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టింది. లోక్‌సభ షెడ్యూల వెలువడడంతో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీనికి అనుగుణంగానే రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీసులు ఎన్నికల బృందాలు ముమ్మరంగా తనిఖీలు మొదలు పెట్టారు. జిల్లా సరిహద్దుల్లో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలు తనిఖీలు చేస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా ఉన్నా సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో మరింత నిఘాను పెంచారు. సిరిసిల్ల నుంచి బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తుండడం, వేములవాడ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఉన్నారు. ఈసారి రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఓటు బ్యాంక్‌ను పెంచుకునే దిశగా ఓటర్లను ఎక్కువగా ప్రలోభాలకు గురిచేస్తారనే ప్రచారం కూడా ఉంది. దీంతో ముందుగానే తనిఖీలు పెంచడంతో చిరు వ్యాపారులు సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు. సిరిసిల్లకు చెందిన స్వామి కారు కొనుగోలుకు సంబంధించి 50 వేల రూపాయలతో హైదారాబాద్ నుంచి సిరిసిల్లకు వస్తుండగా పట్టుకున్నారు. వ్యాపారులు, బ్యాంక్‌లకు వెళ్లడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. 50 వేల రూపాయలకు మించి నగదు తీసుకవెళితే అందుకు సంబంధించిన రుజువు పత్రాలు చూపించాలి. లేనిపక్షంలో వాణిజ్య పన్నుల శాఖకు, అధికారుల బృందానికి అప్పగిస్తారు. మరోవైపు జిల్లాలోని బ్యాంకుల్లో నగదు లావాదేవీలపైకూడా ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టింది. ముఖ్యంగా జీరో ఖాతాల్లో నగదు బదిలీలను పరిశీలించానున్నారు.

నేతల్లో నగదు టెన్షన్

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతల్లో నగదు టెన్షన్ మొదలయ్యింది. ఎన్నికల తనిఖీలకు చెక్‌పోస్టులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, సాటిస్టిక్ సర్వేలెన్స్ వీడియో సర్వేలెన్స్ బృందాలు కూడా పనిచేస్తున్నాయి. ఈ క్రమంలో ఆయా పార్టీల నాయకులు ప్రచార ఖర్చులు, ఇతర అవసరాల నగదును ఉపయోగించుకోవడంలో టెన్షన్ పడక తప్పడంలేదు. ప్రధానంగా కాంగ్రెస్ అధికారంలో ఉండడంతో సిరిసిల్ల సెగ్మెంట్‌పై ప్రత్యేకనిఘా ఉంటుందని భావిస్తున్నారు.

ఆరు చెక్‌పోస్టుల్లో తనిఖీలు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని సరిహద్దుల్లో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జిల్లెల్ల చెక్‌పోస్టు, గంభీరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పెద్దమ్మ చెక్‌పోస్టు, ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెంకట్రావుపల్లి చెక్‌పోస్టు, వేములవాడ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫాజుల్‌నగర్ చెక్‌పోస్టు, బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో కొదురుపాక చెక్‌పోస్టు, రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలో మానాల క్రాస్ రోడ్డు వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, సామాన్య ప్రజలు వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి పంపిస్తున్నారు.



బండి సంజయ్ కాన్వాయ్‌ని తనిఖీ చేస్తున్న పోలీసులు (ఫైల్), వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

అనుమానిత బ్యాంక్ లావాదేవీలపై దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి


బ్యాంకర్‌లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గౌతమి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 21: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బ్యాంక్‌ల పరిధిలో అనుమానిత లావాదేవీలపై బ్యాంకర్లు దృష్టి పెట్టాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి బ్యాంక్ అధికారులను అదేశించారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లో భాగంగా గురువారం బ్యాంకుల కో-ఆర్డినేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంక్‌ల నుంచి లక్ష రూపాయల నగదు తీసుకున్నా, ఖాతాలో జమ చేసినా వారి వివరాలను ఎన్నికల వ్యయపరిశీలకులకు సమాచారం అందించాలని సూచించారు. 10లక్షల రూపాయల కంటే ఎక్కువ జమ అయినా, తీసుకున్నా వారి వివరాలను అదాయపు పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆర్టీజీఎస్ ద్వారా ఒకేసారి ఎక్కువ ఖాతాలకు డబ్బులు బదిలీ చేసినా సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ప్రత్యేక ఖాతాలను తీసుకోవాలని, అన్ని లావాదేవీలు అదే ఖాతా నుంచి చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు, అనుచరుల ఖాతాలపై దృష్టిపెట్టాలని బ్యాంకుల కో-ఆర్డినేటర్‌లకు వివరించారు. ఏటీఎంలు, బ్యాంకులకు నగదును తరలించే ముందు వాహనం నంబర్, వెళ్లే వారి పూర్తి వివరాలు, ఎంత డబ్బులు తీసుకెళ్లుతున్నారు.. తేదీ తదితర వివరాలు పక్కాగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం ఈఎస్ఎంఎస్ యాప్ వినియోగంపై వివరించారు. ఎన్నిలక నియమావళిని బ్యాంకు అధికారులు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఎల్డీఎం మల్లికార్జున్‌రావు, బ్యాంక్‌ల కో- ఆర్డినేటర్‌లు పాల్గొన్నారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు


కవాతు నిర్వహిస్తున్న కేంద్రసాయుధ పోలీసు బలగాలు

సిరిసిల్ల క్రైం, మార్చి 21: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల పట్టణంలో కేంద్రసాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు కేంద్ర సాయుధ పోలీసు బలగాలు సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్, సుభాష్‌నగర్, నెహ్రూనగర్, గోపాల్‌నగర్, బీవైనగర్, సుందరయ్యనగర్, వెంకంపేట, నేతన్న చౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధిచౌక్ మీదుగా గురువారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భం గా టౌన్ సీఐ రఘుపతి మాట్లాడుతూ ఎన్నికలను శాంతియుత వాతావర ణంలో నిర్వహించడమే లక్ష్యంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధైర్యంగా ఓటు హక్కును వినియోగించుకో వాలని ఆయన కోరారు. పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రజలందరికి పోలీసులు ఎల్లవేళలా తోడుంటారని ఆయన తెలిపారు. ఇందుకు భరోసా కోసమే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని సీఐ తెలిపారు.

ఇంకుడు గుంతలు ఉండేలా చర్యలు తీసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ లావణ్య

సిరిసిల్ల టౌన్, మార్చి 21: నూతనంగా నిర్మించే భవనాలు, ఇంటికి తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ లావణ్య అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య భవన నిర్మాణ కార్మికులు(మేస్త్రీలు), లైసెన్స్డ్ ఇంజనీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు నూతనంగా నిర్మించి భవనాలు, ఇంటికి తప్పనిసరిగా ఇంకుడుగుంతలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. భవన నిర్మాణ కార్మికులు, లైసెన్స్డ్ ఇంజనీర్లు, ఇంకుడు గుంతలు ఉండే విధంగా భవన, ఇంటి యజమానులకు వివరించాలని అన్నారు. సమావేశంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వినయ్, నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదుగురు కానిస్టేబుల్స్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్

- పోలీస్ సిబ్బంది తీరుపై ఎస్పీ ఆగ్రహం

వేములవాడ, మార్చి 21: వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక రైటర్‌తో పాటు మరో నలుగురు పోలీస్ కానిస్టేబుల్‌లను ఎస్పీ అఖిల్ మహాజన్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్స్ బృందంలోని నలుగురు కానిస్టేబుళ్లు, స్టేషన్లో రైటర్‌గా పనిచేస్తున్న మరో కానిస్టేబుల్‌ను జిల్లా హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. వీరితో పాటు ఐదుగురు హోంగార్డులను సైతం హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం. అవినీతికి తావు లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు అందజేస్తున్నప్పటికీ, కిందిస్థాయి సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఎస్పీ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో రహస్యంగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణా వ్యవహారంలో వీరిని అటాచ్ చేసినట్లు తెలుస్తోంది.

గర్భిణుల్లో హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- సహజ కాన్పుల సంఖ్యను పెంచాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

ఇల్లంతకుంట, మార్చి 21: గర్భిణులలో హైరిస్క్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైరిస్క్ కేసులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, వీటిని చూసేందుకు నోడల్ అధికారిని నియమించాలని కలెక్టర్ సూచించారు. ఏఎన్ఎంలు ఆశాకార్యకర్తలతో కలిసి క్షేత్రస్థాయిలో గర్భవతుల ఆరోగ్యపరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించుకుంటు అప్రమత్తంగా ఉండాలన్నారు. రక్తహీనత లోపాన్ని నివారించేందుకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకునేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి అవసరమైన మందులు ఇవ్వాలని సూచించారు. జిల్లాలో సుఖప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి గర్భిణీకి హిమోగ్లోబిన్, హెచ్ఐవీ, హైపటైటీస్, థైరాయిడ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. సబ్‌సెంటర్ల వారీగా ఆరోగ్యశాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణులకు ఫిజియోథెరపీ చికిత్స అందించే పరికరాలను పరిశీలించారు. గత నెలలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా కృషిచేసిన మండల వైద్యాధికారిణి, ఏఎన్ఎమ్, వైద్యసిబ్బందిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, ఉప వైద్యారోగ్య అధికారులు శ్రీరాములు, రజిత, ప్రోగ్రాం అధికారులు ఉమ, నయింజహ, వైద్యాధికారిణి శరణ్య,, సిబ్బంది, ఏఎన్ఎమ్‌లు పాల్గొన్నారు.


ఫిజియోథెరపీ అందించే పరికరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

ముస్తాబాద్, మార్చి 21: పోలీస్‌స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా అధికారులు విధులు నిర్వహించాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. ముస్తాబద్ పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలతో పాటు పోలీస్‌స్టేషన్లో పలు రికార్డులను పరిశీలించిచారు. పోలీస్‌స్టేషన్‌లో గల పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకొని త్వరగా వాటిని పూర్తి చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్లూ కోల్ట్ టీమ్‌లు 24 గంటలపాటు ముమ్మరంగా గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతంగా, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని, పోలీస్‌స్టేషన్ పరిధిలో గల పోలింగ్ కేంద్రాలను ప్రతీఒక్కరు విధిగా సందర్శించి ఏమైనా లోటు ఉన్నట్లయితే వెంటనే పైఅధికారులకు తెలపాలన్నారు. పోలీస్ సిబ్బందికి కేటాయించిన గ్రామాలను తరచూ పర్యటిస్తూ గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. స్టేషన్ పరిధిలోగల సమస్యాత్మక, సున్నితమైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు అక్కడి పరిస్థితులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నా రు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- చెక్ పోస్ట్‌ను తనిఖీ చేసిన ఎస్పీ..

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకట్రావుపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ను ఎస్పీ తనిఖీ చేసి సిబ్బంది డ్యూటీ రిజిస్టర్, వాహనాల తనిఖీ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్ట్ వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అక్రమ మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభాలకు గురిచేసే విలువైన వస్తువుల రవాణాకు అడ్డుకట్ట వేయాలన్నారు. ప్రజలు యాభై వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే దానికి సంబంధించిన పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. లేకుంటే డబ్బును సీజ్ చేస్తామని వివరించారు. ఆయన వెంట సీఐ సదన్ కుమార్, ఎస్ఐ శేఖర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఎల్లమ్మ కాలనీలో తీరిన మంచినీటి సమస్య

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గంభీరావుపేట, మార్చి 21: గంభీరావుపేట మండల కేంద్రంలోని ఎల్లమ్మ కాలనీలో 15 రోజులుగా తాగునీటి సమస్య ఎట్టకేలకు తీరింది. ఎల్లమ్మ కాలనీలో మినీ ట్యాంక్ పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. దీంతో 'ఎల్లమ్మ కాలనీలో మంచినీటి కటకట' అని ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి మినీ ట్యాంకును బాగు చేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


మినీ ట్యాంక్‌ను బాగు చేయించిన అధికారులు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి

వీర్నపల్లి, మార్చి 21: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, ఎంపీటీసీ మల్లారపు అరుణ్‌కుమార్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మల్లారపు దేవయ్య ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేసిందని అన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే ఎన్నికల్లో ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక శాఖ మంత్రిని వెంటనే నియమించాలని అన్నారు. కార్మికుల కోసం వేల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు కావాల్సిన అన్నీ వసతులను ప్రభుత్వం కల్పించాలని అన్నారు. ఏప్రిల్ 2న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జరిగే కార్మికుల విస్తృతస్థాయి సమావేశానికి ప్రతి కార్మికుడు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగుంటుక నరేందర్, మండల ప్రధాన కార్యదర్శి కట్కూరి రాజు, మాజీ అధ్యక్షుడు బూస రాజం, కార్మికులు చంద్రయ్య, శంకర్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 21: వేసవికాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జడ్పీ డిప్యూటీ సీఈవో గీత అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ పల్లెల్లో ప్రజలు తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని అన్నారు. తాగునీటి సమస్య ఉన్న కాలనీలను గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. మార్చి 30లోగా వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలను పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను కంపోస్ట్ షెడు కు తరలించి ఎరువుగా మార్చి రైతులకు విక్రయించడంతో ఆదాయం పొందాలని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమాలని పూర్తిస్థాయిలో అమలు చేయాలని అన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. సమావేశంలో డీపీవో వీరబుచ్చయ్య, డీఎల్పీవో మల్లికార్జున్, ఎంపీడీవో సత్తయ్య, ఎంపీఓ వజీర్ అహ్మద్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

వరి పంటకు బోనస్ ప్రకటించాలి

హుజూరాబాద్‌రూరల్: వరి పంటకు ఈ ఖరీఫ్ సీజన్ నుంచే రూ. 500ల బోనస్ ప్రకటించాలని రాష్ట్ర కర్షక రైతు అభివృద్ధి సమితి నాయకులు కోరారు. గురువారం మండలంలోని రాంపూర్‌లో వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్‌కు రూ.2,203, బి గ్రేడ్‌కు రూ.2183 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రావుల భాస్కర్‌రెడ్డి, సాదులా అంశరెడ్డి, చల్లూరి సారయ్య, జక్కోజు ఆంజనే యులు, చల్లూరి ఆగయ్య, రూపిరెడ్డి మల్లారెడ్డి, గంగుల శ్రీనివాస్, రాజు, ఎర్ర రవీందర్ తదితరులు ఉన్నారు.

ఎండిన పంటలను పరిశీలించిన బీఆర్‌ఎస్ నాయకులు

హుజూరాబాద్, మార్చి 21: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట గ్రామంలో నీళ్లు లేక ఎండిపోయిన పంటలను మాజీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ బండ శ్రీనివాస్ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పంటనష్టం జరిగిన ప్రతి ఒక్క రైతుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పంట నష్టం కింద రూ.10వేలు అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలోని ప్రతి రైతుకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండాల్‌రెడ్డి, రైతులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

10లీటర్ల మద్యం పట్టివేత

సైదాపూర్, మార్చి 21: సైదాపూర్ మండల శివారులో ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 10.980లీటర్ల మద్యం పట్టుకొని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం సీజ్ చేసినట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మనపల్లి గ్రామానికి చెందిన రాజయ్య అనే వ్యక్తి కాటన్ డబ్బాలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ. 9,900లు ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బెల్టు షాపులు నిర్వహించిన, డీజేలు నడిపిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకున్న గ్రామస్థులు

మానకొండూర్, మార్చి 21: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో గురువారం గ్రామస్థులు ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకున్నారు. మానేరు వాగు నుంచి ప్రతినిత్యం అక్రమంగా ఇసుక తరలించడం వల్ల దుమ్ము, ధూళితో పాటు అతివేగంగా నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకొని అక్రమ ఇసుకను అరికట్టాలని కోరుతున్నారు. రెండు గంటల పాటు ట్రాక్టర్‌లను ఆపారు.

మానకొండూర్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మానకొండూర్, మార్చి 21 : మానకొండూర్ పంచాయతీ కార్యదర్శి వి. శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు మండల అభివృద్ధి అధికారి నర్సయ్య తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తికి అక్రమంగా ఇంటి నెంబరు కేటాయించారు. దీంతో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి పంచాయతీ కార్యదర్శిని రెండు రోజుల క్రితం సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

రూ.7,750 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 21: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,750 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 63మంది రైతులు 843క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,750, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుల అరెస్ట్

ముస్తాబాద్, మార్చి 21: ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. గ్రామంలో బెల్ట్‌షాపుల నిర్వహిస్తున్న ఈడుగురాళ్ల రాజేశంగౌడ్ వద్ద 18,450 రూపాయలు, కొమిరె ఎల్లం వద్ద 9,060 రూపాయలు, ఈడుగురాళ్ల రామచంద్రం వద్ద 20,000 రూపాయల విలువైన మద్యంను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ముస్తాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వేములవాడ, మార్చి 21: వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పొన్నం రవి అనే వ్యక్తి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో ఉన్న కొంత నగదు అపహరణకు గురయ్యాయని రవి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

వృద్ధురాలిని తాళ్లతో కట్టేసి చోరీ

సిరిసిల్ల క్రైం, మార్చి 21: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో పర్కాల శ్రీలక్ష్మి అనే వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగింది. టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం... పట్టణంలోని బీవైనగర్‌లో బుధవారం రాత్రి 10.30గంటలకు గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న శ్రీలక్ష్మి అనే వృద్ధురాలిని నలుగురు వ్యక్తులు బెదిరించి తాళ్లతో కట్టేసి దోచుకున్నారు. ఆమె ఇంట్లో దాచిన ఆరువేల రూపాయలను, ఒక గ్రాము బంగారం, 12గ్రాముల వెండి నగలు ఎత్తుకొని వెళ్లారు. గురువారం ఉదయం పక్కింటివారు వచ్చి కట్లు విప్పేశారు. దీంతో బాధితురాలు శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతి తెలిపారు. నలుగురు నిందితులు ఏ వైపు నుంచి వచ్చారని సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంభీరావుపేట, మార్చి 21: గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామం వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై రామ్మోహన్ గురువారం తెలిపారు. మండలంలోని మల్లుపల్లె వాగు నుంచి ట్రాక్టర్‌పై అక్రమంగా ఇసుక తరలిస్తుండగా లింగాపూర్ బస్ స్టేజి వద్ద పట్టుకున్నట్టు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లు పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

చందుర్తి, మార్చి 21: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి బస్టాండ్ వద్ద బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం..మండలంలోని ఎనగల్ గ్రామానికి చెందిన బత్తుల జయరాజ్ అనే వ్యక్తి రోడ్డుపై వెళ్తుండగా వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వృద్ధుడు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి


రాజమల్లయ్య(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి, 21: మండలంలోని ఆత్మనగర్ గ్రామానికి చెందిన చిలివేరి రాజమల్లయ్య అనే గీత కార్మికుడు ఆసపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువలు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 22న గ్రామంలోని తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడ్డాడు. ప్రమాదంలో రాజమల్లయ్యకు రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న చిలివేరి రాజమల్లయ్య గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో దొంగతనం


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ కరుణాకర్

వేములవాడ టౌన్, మార్చి 21: వేములవాడ మండలంలోని ఆరెపల్లి గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు సీతమ్మవారి పుస్తెమట్టెలు బుధవారం రాత్రి అపహరించుకుపోయారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి సీతమ్మవారి మెడలోని పుస్తెమట్టెలు అపహరించడంతో పాటు హుండీని పగలగొట్టి డబ్బులను దొంగలించినట్లు తెలిపారు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 21 : మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన 14 మంది వ్యక్తులను గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఒక వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష, రూ. 2,500లు జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మిగతా 13 మందికి 22 వేల రూపాయలు జరిమానావిధించినట్లు తెలిపారు.

వైభవంగా ధర్మపురి బ్రహ్మోత్సవాలు


ధర్మపురిలో కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకవస్తున్న కలెక్టర్


ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం

ధర్మపురి, మార్చి 20: ధర్మపురి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహ, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల కల్యాణోత్సవానికి ప్రభు త్వం పక్షాన కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా గురువారం పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం క్షేత్రానికి చేరుకున్న కలె క్టర్, అధికారులకు ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ ఛైర్మన్ జక్కు రవీందర్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి మంగళ వాయిద్యాలు వెంట రాగా కలెక్టర్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు నెత్తి మీద పెట్టుకుని ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి చేతుల మీదుగా స్వామి వారలకు సమర్పించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య అర్చ కులు వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో కలెక్టర్‌కు స్వామి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పుస్తెలు, మట్టెలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జగిత్యాల ఆర్‌డీవో మధుసూధన్, డీఎఫ్‌వో వేంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పుప్పాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. స్థానిక దేవాలయం వద్ద ఆమె కొద్ది సేపు విలేకరుల సమావే శంలో మాటాడారు. వసతుల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఆయా శాఖల ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా స్వామి వారల ఎదుర్కోలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల ఎదుర్కోలు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముందు ఆలయ అర్చకులు చిలుకముక్కు అశ్విన్ ఇంటికి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారల ఉత్సవ మూర్తులను తీసుకొచ్చారు. అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ ఇంటికి శ్రీ వేంకటేశ్వర స్వామి వారలను తీసుకవచ్చారు. ప్రత్యేకంగా అలంకరణ చేసిన వేదికపై ఆశీనులు చేసిన ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎదుర్కోలు అనంతరం స్వామి వారల ఉత్సవ మూర్తులను ఆలయానికి తీసుక వెళ్లారు. ప్రధాన ఆలయం ఎదుట ధ్వజారోహణం నిర్వహించారు.

నిలిపిఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 21: గోదావరిఖని మంథని రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంద కిరణ్ అనే యువకుడు మృతి చెందాడు. గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన కిరణ్ తన మిత్రుడు రాకేష్‌తో కలసి ద్విచక్రవాహనంపై మంథనివైపు వెళ్తుండగా 3 ఇంక్లయిన్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన బొగ్గు లారీని ఢీకొట్టాడు. తల భాగంలో బలమైన గాయాలు కావడంతో కిరణ్ అక్కడికక్కడే మరణించాడు. రాకేష్ తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతున్నాడు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 21: జమ్మికుంట మండలంలో వేర్వేరు సంఘటనల్లో గురువారం ఇద్దరు వ్యక్తులపై పోలీస్‌లు కేసు నమోదు చేశారు. విలాసాగర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా, పోలీస్‌లు పట్టుకుని కేసు నమోదు చేశారు. అదే విధంగా కోరపల్లి గ్రామానికి చెందిన వడ్నాల ఆశోక్ బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా, అతడి వద్ద రూ.5వేల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

అదనపు వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 21: అదనపు కట్నం కావాలని అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై బుధవారం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన తాళ్లపల్లి ప్రవళికతో తాళ్లపల్లి అజయ్‌కుమార్‌కు 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రవళిక తల్లిదండ్రులు వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. కొంత కాలంగా అదనపు వరకట్నం పది లక్షలు కావాలని అత్తింటి వారు వేదిస్తున్నారంటూ ప్రవళిక పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. భర్త అజయ్ కుమార్, అత్త యశోద, మామ శ్రీహరి, మరిది విజయకుమార్, ఆడబిడ్డ రేష్మ, బైరెడ్డి శివసాయిలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలు

● విద్యార్థి సంఘాల ఆందోళన


విద్యార్థి పునీత్ వీపుపై గాయాలు

కోల్‌సిటీటౌన్, మార్చి 21: గోదావరిఖని ఎల్‌బీనగర్‌లోని ఇండో అమెరికన్ స్కూల్‌లో 3వ తరగతి విద్యార్థి మేకల పునీత్‌ను టీచర్ చితకబాదింది. సైన్స్ సబ్జెక్టులో మార్కులు తక్కువ వచ్చాయని పునీత్‌ను బుధవారం టీచర్ కొట్టడంతో చేతులు, వీపు పైన వాతలు వచ్చాయి. ఈ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు గురువారం పాఠశాలకు వచ్చి యాజమాన్యాన్ని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌యూఐ నాయకుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. ఈ విషయమై వాట్సాప్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) కౌన్సిలర్ సతీష్ ఆధ్వర్యం లో విచారణ చేపట్టారు. విద్యార్థి ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. సేకరించిన వివరాలతో కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని సతీష్ తెలిపారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా 1089 ట్రోల్‌ఫీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖలో డేటాను సకాలంలో ఆన్‌లైన్ చేయాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు


పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

● సిరిసిల్ల డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు

సిరిసిల్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో కార్యక్రమాల అమలు తీరు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాజన్నసిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏఎన్ఎంలు, సిబ్బందికి హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫ్మరేషన్ సిస్టమ్, హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన, డేటా శిక్షణను నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, రోగ నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ కేంద్రాల పనితీరు, ఇతర అంశాలపై ఉమ్మడి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహణ అధికారి సురేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. డేటా సేకరణతో పాటు సకాలంలో సక్రమంగా ఆన్‌లైన్ చేయాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమ, డీడీఎం కార్తీక్, ఏవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంవో బాలయ్య, డీఎస్‌వో పద్మయ్య, సత్యానారాయణ, శ్రీనివాస్, ఐసీటీసీ కౌన్సిలర్ గంగయ్య, దయాకర్, శ్రీనివాస్, శివ, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనంతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి రాజశేఖర్

గణేశ్‌నగర్,మార్చ్ 21: డిగ్రీ తర్వాత యువతకు విస్తృత ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ప్రతిభ, నిరంతర కృషి, సూక్ష్మ పరిశీలన, ఆధ్యయన శీలత, క్రమశిక్షణ, వార్తా పత్రికల విశ్లేషణ, బృంద చర్చలు, ప్రణాళిక, లక్ష్యంతో కూడిన లోతైన విషయ అవగాహనతో ఉద్యోగ సాధన సాఫల్యం అవుతుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య బి రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్‌సైన్స్‌కళాశాల (అంతర్గత నైపుణ్యాల సాధన విభాగం) ఆధ్వర్యంలో కెరీర్ ప్లానింగ్‌పై నిర్వహించిన కార్యశాలలో ఆచార్య రాజశేఖర్ మాట్లాడారు. చదువు కేవలం డిగ్రీల కోసం కాకుండా ప్రతిభ, విషయ సాధికారత, ప్రజ్ఞా సామర్థ్యాల పెంపుదల దిశగా జరగాలన్నారు. నచ్చిన అంశాలలో విస్తృత అవకాశాలు ఆధునిక యుగంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కేవలం సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్, ఐటీ రంగాలే కాకుండా జర్నలిజం, లలిత కళలు, వంటి ఎన్నో అవకాశాలు గ్లోబల్ స్థాయిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ఉన్న ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాల నైపుణ్య వికాస కేంద్రంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, డా కే సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కే మల్లారెడ్డి, ఏ శ్రీనివాస్, ఎం అర్చన, వరప్రసాద్, శారద పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



బోర్నపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్, మార్చి 21: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్ఠు వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆశావర్కర్లు ఇంటింటికి తిరుగుతూ కుష్ఠు వ్యాధి లక్షణాలను గుర్తించారు. లెప్రసీ నోడల్ పర్సన్ రమేష్, ఏఎన్ఎం వనిత, ఆశావర్కర్లు అరుణ, రమాదేవి, మున్సిపల్ వార్డు అధికారులు లత, పారిజాతం తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌లపై పోలీసుల దాడులు


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కోనరావుపేట, మార్చి 21: మండలంలోని మల్కపేటలో బెల్ట్‌షాపులపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కోనరావుపేట ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి గురువారం దాడులు నిర్వహించారు. మల్కపేట గ్రామానికి చెందిన భోగి నాగరాజు, కుంట వెంకటి ఇంట్లో సోదాలు నిర్వహించగా సుమారు తొమ్మిది వేల రూపాయల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి



మాట్లాడుతున్న వీసీ సంకశాల మల్లేష్

● ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, మార్చి21: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి ఆరోహణ 2024 స్టూడెంట్ మీట్ లాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్‌యూ విసి ఆచార్య సంకశాల మల్లేష్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయంలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఏర్పాటు చేసిన శాతవాహన ఆరోహణ 2024 ఎంబీఏ, బీబీఏ విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో కోవిడ్ తర్వాత ఒక మంచి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. స్కిల్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యేవారికి, మార్కెట్‌కు సంబంధించిన వాటికి ప్రిపేర్ అయ్యేవారికి ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, ఇంటర్వ్యూ విధానంపై అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమని వివరిం చారు. ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న వారిని గ్లోబల్ వ్యవస్థకు అనుగుణంగా తయారు చేయడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ రాజశేఖర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి హరికాంత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్, డాక్టర్ ఈ మనోహర్, ఎంబీఏ ఫ్యాకల్టీ డాక్టర్ మనోజ్ కుమార్ , డాక్టర్ టి.కృష్ణకుమార్, కామర్స్ ఫ్యాకల్టీ డాక్టర్ కే తిరుపతి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సావిత్రి, డాక్టర్ రవి పాల్గొన్నారు.

తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు


తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు

ఎండపల్లి, మార్చి21; ఉపాధిహామీ కార్మికుల తవ్వకాలలో పురాతన విగ్రహాలు బయటపడ్డ సంఘటన మండలంలోని చెర్లపల్లి గ్రామంలో జరిగింది. కార్మికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీ లాగే కార్మికులు గురువారం గ్రామంలోని ఎల్కల దేవి గుట్టకు కందకాలు తవ్వడానికి కూలీలు వెళ్లారు. పనిచేస్తుండగా 15 పురాతన విగ్రహాలు బయటపడగా గ్రామస్థులు అక్కడికి చేరుకొని పూజలు నిర్వహించారు. విషయం సంబంధిత అధికారులకు తెల్పడంతో వారు విగ్రహాలను పరిశీ లించారు. విగ్రహాలు ఎప్పటివో తెలియడం కోసం పురావస్తుశాఖ వారికి సమాచారం ఇవ్వనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

తిమ్మాపూర్‌లో యూనిసెఫ్ సెంట్రల్ టీం సందర్శన


తిమ్మాపూర్‌లో పరిశీలిస్తున్న యూనిసెఫ్ సెంట్రల్ టీం సభ్యులు

తిమ్మాపూర్, మార్చి21: తిమ్మాపూర్ మండల కేంద్రంలో యూనిసెఫ్ సెంట్రల్ టీం సభ్యులు సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద ఏర్పాటు చేసిన కంపోస్ట్ స్టాల్, శానిటరీ సిబ్బంది మెటీరియల్ స్టాల్, శానిటరీ పరికరాల స్టాల్‌లను పరిశీలించారు. అంగన్వాడీలలో రిట్రో ఫిటింగ్ టాయిలెట్‌లను, విట మిన్ గార్డెన్‌లను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ప్రధామిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికులకు నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని బృందం సభ్యులు పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచ నలు చేసి పనులపై సంతృప్తి వ్యక్తం చేసి అధికారులను, సిబ్బందిని అభినందించారు. ఢిల్లీ యూనిసెఫ్ కార్యాలయం నుంచి కౌశిక్ బెనర్జీ, అరలికట్టి వెంకటేష్ , మురళీకృష్ణ, కొండవీటి ఫనీంద్ర, ఎంపిడివో విజయ్ కుమార్, ఎంపివో కిరణ్ కుమార్, యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ స్వామి సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఆర్‌ఎం

భగత్‌నగర్, మార్చి 21: కరీంనగర్ బస్టాండ్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత బుధవారం తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని టాయిలెట్స్, లహరి ఏసీ బస్సులు, స్టాల్స్‌ను తనిఖీ చేశారు. డిప్యూటి రీజినల్ మేనేజర్స్ భూపతిరెడ్డి, సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, డిపో మేనేజర్లు మల్లయ్య, మల్లేశం, కార్గో ఎటిఎం సదాశివ, బస్‌స్టేషన్ మేనేజర్ రజనీకృష్ణ పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



పెద్దలింగాపూర్‌లో ఎండిన పంటలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, మార్చి 21: పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు పెట్టుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్‌లో సాగునీరు లేక ఎండిపోయిన పంటలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సీజన్‌లో పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించామన్నారు. పరిపాలనలో అవగాహన లేని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి వల్లనే రైతులకు కష్టాలు వచ్చాయని విమర్శించారు. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలు ఎండిపోగా కొందరు రైతులు పంటలను తగలబెట్టుకున్నారని, మరికొందరు పశువులకు మేతకు వదిలిపెట్టారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో గంట విద్యుత్ కూడా పోలేదని, ప్రస్తుత పరిస్థితి భిన్నంగా మారిందన్నారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, నాయకులు కేతిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మీసరగండ్ల అనీల్‌కుమార్, బాగయ్య, కుమార్, బొప్ప శ్రీనివాస్, బాలరాజు, బిక్షపతి, పసుల నర్సయ్య, జక్కుల శ్రీను, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందుంటున్న సొసైటీ

- మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి



నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

సిరిసిల్ల టౌన్, మార్చి 21: దార్ ఉల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ సామాజిక సేవలో ముందుటున్నదని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని గురువారం సిరిసిల్ల పట్టణంలో దార్ ఉల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేద ముస్లింల కుటుంబాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి చేతుల మీదుగా నిత్యవసర సరుకులు, దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని సొసైటీ సభ్యులు ప్రతీసంవత్సరం పట్టణంలోని పేద ముస్లిం కుటుంబాలకు నెలరోజులకు సరిపడే నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. పేద ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తూ ఆదర్శప్రాయంగా సొసైటీ నిలుస్తూ సామాజిక సేవలో స్ఫూర్తినిస్తున్నారని అన్నారు. మనం చేసే సహాయంలోనే భగవంతుడు ఉంటాడని భగవంతుడు చూపిన మార్గంలో సాటి మనుషులను గౌరవిస్తూ జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో దార్ ఉల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకుడు బాబా, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, కౌన్సిలర్ అకుల కృష్ణ, నాయకులు కల్లెపల్లి శ్రీనివాస్, సలీం, పాషా, రఫీ అన్సార్‌పాషా, ముస్లింలు పాల్గొన్నారు.

పరబ్రహ్మమూర్తి మరణం తీరనిలోటు

- సిరిసిల్లలో నివాళులర్పించిన ఉపాధ్యాయులు



నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల రూరల్, మార్చి 21: ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలివిడిగా ఉంటూ పాఠశాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన ప్రధానోపాధ్యాయుడు పరబ్రహ్మమూర్తి అకాల మరణం ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని ఉపాధ్యాయులు అన్నారు. సిరిసిల్ల పట్టణం శివనగర్ కుసుమరామయ్య జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా 10 సంవత్సరాలు పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన పరబ్రహ్మమూర్తి కరీంనగర్‌లో గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించాడు. దీంతో ఆయనతో కలిసి పని చేసిన ఉపాధ్యాయులు శోకసంద్రంలో మునిగిపోయారు. పాఠశాలలో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి ఉపాధ్యాయులు నివాళులర్పించి ఆయన పాఠశాలకు చేసిన సేవలను గుర్తుచేసుకొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మాల్లారపు పురుషోత్తం, ఉపాధ్యాయులు పాకాల శంకర్‌గౌడ్, రవీందర్, కుమ్మరి మల్లేశం గోవింద రావు, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశం, సమ్మయ్య, సంధ్యారాణి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న గర్భిణులు

చందుర్తి, మార్చి 21: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మండలంలోని ముడపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాగులు, సజ్జలు, కొర్రలు, మొదలగు తృణ ధాన్యాల్లో ఐరన్, పిండిపదార్థాలు అధికంగా లభిస్తాయన్నారు. చిరుధాన్యాలను తప్పనిసరిగా మహిళలందరూ స్వీకరించి ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, రాధిక, పీఎస్ ఉపాధ్యాయులు సబిత, వినోద, బాలింతలు, గర్భిణులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలి

కోనరావుపేట, మార్చి 21: విద్యార్థినులకు మంచి భోజనంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాధికారి రమేష్ సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను గురువారం సందర్శించి విద్యార్థులకు భోజనము వసతులను పరిశీలించి పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. విద్యార్థులకు ఇష్టమైన రీతిలో బోధించి భోజన విషయంలో మెనూ పాటించాలని సూచించారు. ఆయన వెంట విద్యాధికారులు దూస రఘుపతి, పద్మజ ఉన్నారు.



కస్తూర్బా పాఠశాలలోని సమస్యలు తెలుసుకుంటున్న డీఈవో రమేష్

పెండింగ్‌లోనే కరీంనగర్



మూడో జాబితాలోనూ ఎంపీ అభ్యర్థిని ప్రకటించని కాంగ్రెస్ అధిష్ఠానం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కాంగ్రెస్ కరీంనగర్ అభ్యర్థిపై ఉత్కంఠ కొనసాగుతోంది. బుధ, గురువారాల్లో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశమై అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేసింది. ఇందులో తెలంగాణకు చెందిన ఐదు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ఉమ్మడి జిల్లాలోని పెద్దపల్లి నియోజకవర్గానికి గడ్డం వంశీకృష్ణను అభ్యర్థిగా ఖరారు చేసింది. కరీంనగర్, నిజామాబాద్ అభ్యర్థుల ఎంపికను పెండింగ్‌లో పెట్టింది.

● సామాజిక వర్గాలే కీలకం

కరీంనగర్ స్థానం నుంచి అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వెలిచాల రాజేందర్ రావు, రుద్ర సంతోష్‌కుమార్ టికెట్ కోసం పోటీపడుతున్నారు. ఇక్కడ అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి పేరును ఖరారు చేసినా రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించే సీట్లు ఎక్కువవుతున్నాయనే కారణంగా పెండింగ్‌లో ఉంచారని సమాచారం. వెలమ సామాజికవర్గానికి ఒక్క సీటు కూడా కేటాయించని నేపథ్యంలో వెలిచాల రాజేందర్‌రావు పేరు ప్రధాన పరిశీలనకు వచ్చినట్లు సమాచారం. బీసీ సామాజిక వర్గానికి చెందిన రుద్ర సంతోష్‌కు సీటు ఇవ్వాలని ఆ సామాజిక వర్గం నేతలు డిమాండ్ చేస్తుండడంతో అధిష్ఠానం ఇంకా ఏమి తేల్చుకోలేక ఎంపిక వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని జగిత్యాల, కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గాలు అంతర్భాగమై ఉన్న నిజామాబాద్ పార్లమెంట్ స్థానం అభ్యర్థి ఎంపిక కూడా పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఇక్కడి నుంచి జిల్లాకే చెందిన ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన కార్మికులు

సిరిసిల్ల టౌన్, మార్చి 21: పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సుల్తాన్ నర్సయ్య అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ లావణ్యను యూనియన్ నాయకులు కలసి మున్సిపల్ కార్మికుల సమస్యలను వివరించి పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సుల్తాన్ నర్సయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ మాట్లాడారు. సిరిసిల్ల మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని రెండునెలల క్రితం కమిషనర్, పాలకవర్గంను కోరామన్నారు. మార్చి నెలలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని ఇప్పటికీ సమస్యలను పరిష్కరించ లేదని ఆరోపించారు. 2009 నుంచి 2012 వరకు 118 మంది కార్మికుల పీఎఫ్ డబ్బులను వారి వ్యక్తిగత ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. 33 మంది కార్మికులకు సంబంధించి రెండు సంవత్సరాల పీఎఫ్ డబ్బులు కట్ చేశారని మున్సిపల్ నుంచి పీఎఫ్ జమచేసి కార్మికులను ఇవ్వాలని అన్నారు. విలీన గ్రామాలకు చెందిన 25 మంది కార్మికులకు రావలసిన పీఎఫ్ డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. పెరిగిన పీఆర్‌సీ ఏరియర్స్ వేతనాలు ఆరు నెలలవి రావల్సి ఉందని, ప్రభుత్వం పెంచిన రూ 1000 వేతనాలు అమాలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రతీకార్మికుడికి ఐడెంటీ కార్డులు ఇవ్వాలన్నారు. కార్మికులకు ఇవ్వాల్సిన సబ్బులు, నూనెలు, బట్టలు, చెప్పులు వంటి సామగ్రిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదేవిధంగా వేసవి కాలంలో కార్మికులకు ఒకపూట పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి కాసర్ల శంకర్, ఉపాధ్యక్షురాలు గడ్డం భారతమ్మ, కోశాధికారులు నర్మెట ఉమ, మారుపాక లక్ష్మి, కార్యవర్గ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



కమిషనర్ లావణ్యకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

ప్రమాద బీమా ప్రొసీడింగ్ పత్రం అందజేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 21: మండల కేంద్రానికి చెందిన పెంటం కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ పార్టీ ప్రమాద బీమా ప్రొసీడింగ్ పత్రాన్ని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ భవన్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అందజేశారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటోందని అన్నారు. రెండు లక్షల ప్రమాద బీమా వర్తించేలా ప్రొసిడింగ్ పత్రాన్ని అందజేశామని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మృతుడి భార్య సోనీ, తండ్రి పద్మయ్య, సోదరుడు ప్రవీణ్, నాయకులు పర్శరాములుగౌడ్, సందీప్, శివరామకృష్ణ, సల్మాన్, కార్తీక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అడ్‌హక్ కమిటీ ఎన్నిక

రుద్రంగి మార్చి 21: రుద్రంగి మండల ఎమ్మార్పీఎస్ అడ్‌హక్ కమిటీని రాజన్న సిరిసిల్ల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ ఎలగందుల బిక్షపతి ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బడుగు సంజీవ్ మాదిగ, ఉపాధ్యక్షులుగా దయ్యాల నారాయణ మాదిగ, ఎలగందుల గంగరాజం, ప్రధాన కార్యదర్శిగా కాదాస్ లక్ష్మణ్, కార్యదర్శిగా సింగారపు బాబు, కోశాధికారిగా దయ్యాల నరేష్, గౌరవ సలహాదారులుగా దయ్యాల సందెల నరసయ్య, రేమాల గంగారెడ్డి, అక్కనపెల్లి లక్ష్మణ్, సంతోష్, కాదాస్ శ్రీనివాస్, బడుగు రమేష్ ఎన్నికయ్యారు.

అంతర్ వ్యవసాయ కళాశాలల క్రీడా పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తంగళ్లపల్లి, మార్చి 21: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన 2023-24 సంవత్సరం అంతర్ కళాశాలల క్రీడాసాంస్కృతిక పోటీల్లో సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పోటీలను పలు అంశాలలో, రెండు దశల్లో ఫిబ్రవరి, మార్చి నెలలలో అశ్వరావుపేట, హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో పలు అంశాల్లో సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో బహుమతులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గురువారం కళాశాలలో డీన్ డాక్టర్ శ్రీదేవి అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కుమారస్వామి, వ్యాయామ ఉపాధ్యాయుడు రమేష్, సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి రజితా సుల్తానా, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో కుట్టుమిషన్ల పంపిణీ

ఇల్లంతకుంట, మార్చి 21: మండల కేంద్రంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. చిన్నజియర్ ట్రస్ట్ భవనంలో మూడు నెలలుగా శిక్షణ పొందుతున్న 42 మంది మహిళలకు ముగింపు రోజు కుట్టుమిషన్లు అందించారు. ఈ సందర్భంగా మహిళలు తమ కాళ్లపై వారు నిలబడి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కుట్టుమిషన్లు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్‌కుమార్, సువర్ణ మహిళలు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

సమీపిస్తున్న వరికోతలు

- ● ఆరబోతకు, కొనుగోళ్లకు కరువైన స్థలాలు
- ● పట్టించుకోని అధికారులు
- ● అయోమయంలో అన్నదాతలు

సిరిసిల్ల రూరల్, మార్చి 21: నారు పోసినప్పటినుంచి పంట చేతికి వచ్చే వరకు ఎన్నో సమస్యలను అధిగమించి తీరా పంట చేతికి వచ్చిన తరువాత అమ్ముకోవడానికి అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతీ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని ఆరబెట్టిడంతోపాటు విక్రయించేందకు కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేకపోవడంతో అన్నదాతుల ఆగమైపోతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, జగ్గారావుపల్లె, సర్దాపూర్ గ్రామాల్లో మరో 20 రోజుల్లో వరి పంటలు కోతలకు రానున్నాయి. అయితే ఈ గ్రామాలకు ఎక్కడకూడా ధాన్యాన్ని ఆరబెట్టడానికిగానీ, విక్రయించేందుకు కానీ స్థలాలు లేకపోవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడు గ్రామాలకు చెందిన రైతులందరూ గ్రామాలకు అనుకొని నూతనంగా నిర్మించిన రెండో బైపాస్ రోడ్డులో ఒక వైపు రోడ్డును మూసివేసి ధాన్యాన్ని పోసి ఆరబెడుతుంటారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 1నుంచి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఈ ఏడు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేకపోవడంతోపాటు రెండో బైపాస్ రోడ్డు ప్రారంభం కావడంతో వాహనాల రాకపోకలు నిరంతరం ఉండడంతో అన్నదాతలు కోసిన ధాన్యాన్ని ఎక్కడ పోసి ఆరబెట్టాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు.

● రెండో బైపాసే కొనుగోలు కేంద్రం..

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు నుంచి ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వరకు నూతనంగా నిర్మించిన రెండో బైపాస్ రోడ్డే రైతులు ఒకవైపు పండించిన ధాన్యాన్ని ఆరబెట్టి అక్కడనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి విక్రయిస్తుంటారు. దీంతో రోడ్డునపోయే వాహనాదారులు ఇబ్బందులు పడడంతోపాటు రాత్రిపూట ప్రమాదాలకు గురవుతుండేవారు. అయితే ఇప్పడు రోడ్డు పూర్తికావడంతో ఈసారి ఆ రోడ్డుపై కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం కష్టంగా మారింది. ఈ ఏడు గ్రామాలకు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పెద్దూర్ శివారులోని ప్రభుత్వం భూమిలో పదేకరాలను కేటాయించాలని ఇటీవల వార్డు కౌన్సిలర్‌లు బోల్గం నాగరాజుగౌడ్, లింగంపల్లి సత్యానారాయణతోపాటు పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్‌తోపాటు పాలకవర్గం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు.



సిరిసిల్ల రెండో బైపాస్ రోడ్డులో ఆరబెట్టిన ధాన్యం (ఫైల్)

కొనుగోలుకు స్థలాన్ని కేటాయించాలి

- జీల కిషన్‌యాదవ్, పెద్దూర్ సింగిల్ విండో చైర్మన్



పెద్దూర్‌లో ధాన్యం కొనుగోలు సింగిల్ విండో అధ్వర్యంలో కొద్ది రోజులుగా ధాన్యం ఆరబెట్టడానికి సరైన స్థలం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రెండో బైపాస్ రోడ్డుపై రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. అక్కడే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కొనుగోలు కేంద్రాలకు పెద్దూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో 10 ఎకరాలను ఏడు గ్రామాల కొనుగోలు కేంద్రాలకు కేటాయించాలి.

వాహనాదారుల ఇబ్బందులు

- బోల్గం నాగరాజుగౌడ్, కౌన్సిలర్, చిన్నబోనాల



సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో విలీనం చేసిన ఏడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ప్రతీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించడం కోసం ఇబ్బందులు పడుతుండడంతోపాటు రెండో బైపాస్ రోడ్డుపై ఆరబెట్టుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాగం స్పందించి ఏడు గ్రామాల్లో ధాన్యాన్ని విక్రయించేందుకు స్థలాలతోపాటు కొనుగోలు కేంద్రాలను నిర్మించి రైతుల కష్టాలను తొలగించాలి.

వైభవంగా లక్ష్మీనృసింహుడి కల్యాణం

- తిలకించిన వేలాది మంది భక్తులు - హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 21: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం గురువారం సాయంత్రం గోధూళి సుముహూర్తాన అత్యంత వైభవంగా జరిగింది. క్షేత్ర నలుమూల నుంచి భారీగా తరలివచ్చిన వేలాది మంది భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవం పురస్కరించుకుని లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర), వేంకటే శ్వరస్వామి వారల ఉత్సవమూర్తులను సాయంత్రం వేళలో ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ఆలయాల నుంచి బయటకు తీసుకువచ్చారు. ఉత్సవమూర్తులను శేషప్ప కళా వేదికపైన ఆసీనులు చేశారు. అంతకు ముందు ఆలయ అర్చకులు ఇంటి వద్ద నుంచి లక్ష్మీనరసింహ, వేంకటేశ్వరస్వామి వారలకు ఎదురుకోలు ఉత్సవా లు నిర్వహించారు. యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవంలో అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, వేదపారా యణదారు పాలెపు ప్రవీణ్‌శర్మ, కల్యాణం నిర్వహించారు. అర్చకులు శాస్త్రోక్తంగా స్వామివారల కల్యాణోత్సవం జరిపించారు. వేలాది మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకుని కట్న కానుకలు, అమ్మవారలకు ఒడి బియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పురాణ ప్రవచకులు బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, పలువురు పండితులు ఉత్సవ తీరు గురించి ప్రత్యక్ష వ్యాఖ్యానం చేశారు.

అంతకు ముందు రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వామి కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఉదయ్‌కుమార్, సిబ్బంది భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు. రవీందర్, ఈవో శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ధర్మపురి, బుగ్గారం జడ్పీటీసీలు అరుణ, రాజేందర్, రాజమణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ రామయ్య పాల్గొన్నారు. స్వామివారల కళ్యాణోత్సవం తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కాకతీయ కాలువ నీటిని పొదుపుగా వాడాలి

జగిత్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో ప్రస్తుతం నీటి మట్టం తక్కువగా ఉన్నందున, మిగిలిన నీటిని తాగునీటి కోసం మాత్రమే వినియోగించాల్సి ఉన్నందున ప్రస్తుతం విడుదల చేస్తున్న నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని ఎస్సారెస్పీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. కాకతీయ ప్రధాన కాలువ ద్వారా జోన్-1(డీ5 నుంచి డీ 53) ఆయకట్టుకు ఈనెల 25వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు నీరు సరఫరా చేయబడుతుందని తెలిపారు. ఆయకట్టుకు ప్రస్తుత యాసంగికి ఇదే చివరి తడి అవుతుందన్నారు. నీటిని రైతులు పొదుపుగా వినియోగించుకోవాలని ప్రకటనలో కోరారు.

11 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు

కథలాపూర్, మార్చి 21: యాసంగి సీజన్‌కు సంబంధించి సెర్ప్ ఆధ్వర్యంలో మండలంలో 11 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎం నరహరి తెలిపారు. అంబారిపేట, బొమ్మెన, భూషణరావుపేట, చింతకుంట, దూలూరు, కథలాపూర్, పెగ్గెర్ల, పోతారం, సిరికొండ, తక్కళ్లపల్లి, తాండ్ర్యాల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నామన్నారు. రైతాంగం తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు మాత్రమే తెచ్చి విక్రయించుకోవాలని దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. సిబ్బందికి ప్రభుత్వం కొనుగోళ్లపై శిక్షణా కార్య క్రమాలు కొనసాగించనుందని తెలిపారు.